'సిద్ధప్ప వరకవి' సేవలు చిరస్మరణీయం

హుస్నాబాద్‌లో సిద్ధప్ప వరకవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సిద్ధప్ప విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

హుస్నాబాద్, జూలై 9: గోల్కొండ ఆస్థాన కవుల్లో ఒకరిగా ఉంటూ తన రచనలతో ప్రజలను చైతన్యం చేసిన అనంతవరం సిద్ధప్ప వరకవి రాజయోగి సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో పట్టణ కుమ్మర శాలివాహన సంఘం ఆధ్వర్యంలో సిద్ధప్ప వరకవి 121వ జయంతి నిర్వహించారు. సిద్ధప్ప చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు బెక్కంటి భీమయ్య, ప్రధాన కార్యదర్శి నాంపల్లి సమ్మయ్య, ఉపాధ్యక్షుడు ఇటికాల స్వామి, నాయకులు ఇటికాల మొండయ్య, నమిలికొండ అయిలయ్య, బెక్కంటి రాజయ్య, ఇటికాల రమేశ్, ప్రభాకర్, ఇటికాల శ్రీనివాస్, నార్లపురం బుచ్చయ్య, ఆషాడం శ్రీనివాస్, ఉప్పుల వెంకట్, నమిలికొండ రాజేందర్, సముద్రాల సతీశ్, యాదవ సంఘం నాయకుడు గొర్ల అయిలేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

కోహెడలో...

కోహెడ జూలై 9: తెలంగాణ వేమనగా పేరుగాంచిన మండలంలోని గుండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన అనంతవరం సిద్ధప్ప వరకవి 121వ జయంతిని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆశ్రమంలో నిర్వహించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఈకార్యక్రమంలో ఆయన కుమారుడు అనంతవరం మాణిక్యలింగం, గ్రామస్తులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సిద్దిపేటలో భాగస్వాములు కావాలి


చెత్త వాహనాలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ మంజులారాజనర్సు

సిద్దిపేట,జూలై 9: స్వచ్ఛ సిద్దిపేటలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్ పర్సన్ మంజులారాజనర్సు అన్నారు. మంగళవారం వైస్ చైర్మన్ కనకరాజు, కమిషనర్ ప్రసన్నరాణితో కలిసి సిద్దిపేట మున్సిపల్ పరిధిలో చెత్త సేకరణ నిమిత్తం 39 లక్షలతో కొనుగోలు చేసిన మూడు చెత్త వాహనాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇప్పటికీ పట్టణంలో మహిళలు తడి, పొడి, హానికర చెత్తను వేరు చేసి ఇస్తున్నారని, ఈ పద్ధతిని ఇలాగే కొనసాగించాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని మెరుగుపర్చడానికి నూతనంగా మూడు కొత్త వాహనాలు కొనుగోలు చేశామన్నారు. సిద్దిపేటను శుద్ధిపేటగా మార్చడానికి పట్టణ ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

నిఘా నీడలో మల్లన్న క్షేత్రం


మల్లన్న క్షేత్రంలో పని చేస్తున్న సీసీ కెమెరాలు

చేర్యాల, జూలై 9 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి క్షేత్రంలో 24గంటల పాటు నిఘా నీడలో ఉండే విధంగా ఆలయ అధికారులు, పోలీస్‌శాఖ అన్ని చర్యలు చేపట్టింది. ఇటీవల కొమురవెల్లి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన రాజాగౌడ్ ఆలయ ఈవో ఎ.బాలాజీతో కలిసి మల్లన్న క్షేత్రంలో భద్రత పై చర్చించారు.అనంతరం క్షేత్రంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, భక్తుల భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా టెంపుల్ ఆవరణలో 20, పోలీస్‌స్టేషన్ పరిధిలోని 22 సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించారు. రెండు రోజుల నుంచి మల్లన్న క్షేత్రం మొత్తం 42 సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంది. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రాష్ట్ర నలుమూలల నుంచి ప్రతి ఆది, బుధవారాల్లో భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుంటున్నారని, దీంతో పాటు ప్రత్యేక రోజులు, పండుగలు, సెలవుల్లో భక్తులు వస్తున్న దృష్ట్యా వారి భద్రత కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.

12న కలెక్టరేట్ల ముట్టడి

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు

సిద్దిపేట, జూలై 9: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌ను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈనెల 12న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్లను ముట్టడిస్తామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు అన్నారు. మంగళవారం సిద్దిపేటలో జరిగిన ఎస్ఎఫ్ఐ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే చేస్తామని చెప్పిన కాంగ్రెస్ విద్యార్థులను చిన్నచూపు చూస్తున్నదన్నారు. ఉపకార వేతనాలు మంజూరు చేయకపోవడం వల్ల పేద, మధ్య తరగతి విద్యార్థులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు రంజిత్‌రెడ్డి, ప్రశాంత్, నాయకులు సంజీవ్ శేఖర్, సంతోష్, తాడూరి భరత్‌కుమార్, అభి పాల్గొన్నారు.

ఘనంగా డీసీసీబీ డైరెక్టర్ పుట్టిన రోజు వేడుకలు

ములుగులో కేక్ కట్ చేస్తున్న డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి

ములుగు, జూలై 9 : డీసీసీబీ డైరెక్టర్, ములుగు పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి పుట్టిన రోజు వేడుకలను బీఆర్ఎస్ శ్రేణులు, మండల నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో ఆయన అభిమానులు అన్నదానాలు, సేవా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆయన బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి మొక్కలు నాటి కేక్‌కట్ చేసి పుట్టినరోజు వేడుకలు జరుపుకొన్నారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు అంజిరెడ్డిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జహంగీర్, బీఆర్ఎస్ యూత్ వింగ్ ఉపాధ్యక్షుడు జుబేర్‌పాషా, ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు దుంబాల లింగారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కరుణాకర్‌రెడ్డి, కిష్టయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సిద్దిపేట టౌన్,జూలై 9 : సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ సూచించారు.పట్టణంలోని సిటిజన్ స్కూల్ విద్యార్థులకు మంగళవారం ఆయన గంజాయి,సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీజాబాలకృష్ణ హరి, సుధాకర్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుడి అరెస్టు

సిద్దిపేట టౌన్,జూలై 9 : బైక్ దొంగను సిద్దిపేట పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు టూటౌన్ సీఐ ఉపేందర్ వివరాలు వెల్లడించారు.కొండపాక మండల మర్పడ్గ గ్రామానికి చెందిన రమేశ్ టూటౌన్,వన్‌టౌన్ సర్కిల్ పరిధిలో పలు బైక్‌లను అపహరించాడు. బాధితులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని చెప్పారు. పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న క్రమంలో రమేశ్ అనుమానాస్పదంగా కనిపించగా అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాలను అంగీకరించాడని, ఈ మేరకు అతడి వద్ద నుంచి నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామన్నారు. దొంగను చాకచక్యంగా పట్టుకున్న పోలీసులను ఏసీపీ మధు అభినందించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

చేర్యాల, జూలై 9: మండలంలోని చుంచనకోట వద్ద మంగళవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై దామోదర్ మాట్లాడుతూ గ్రామంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో అక్రమంగా తరలిస్తున్న 13క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

ఇచ్చిన హామీలు కాంగ్రెస్ నెరవేర్చాలి

సిద్దిపేట టౌన్,జూలై 9 : అసెంబ్లీ ఎన్నికల సమయంలో ముదిరాజ్‌లకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేశం డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ముదిరాజులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలతో కూడిన గోడప్రతికను మంగళవారం ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీసీడీలో ఉన్న ముదిరాజులను ప్రభుత్వం బీసీఏలోకి మార్చాలన్నారు. ముదిరాజులకు ఫైనాన్స్ కమిషన్ ఏర్పాటు చేసి వేయి కోట్ల నిధులు మంజూరు చేయాలన్నారు. చెరువులు,కుంటలపై బెస్త,ముదిరాజ్‌లకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ముదిరాజు సంఘం రాష్ట్ర నేత తుపాకుల బాల్‌రంగం, జిల్లా అధ్యక్షుడు ధర్మ, భిక్షపతి,నాగేందర్,రాధాకృష్ణ,నర్సింహులు, శ్రవణ్,కృష్ణ, పరశురాములు పాల్గొన్నారు.

ఇసుక డంపు స్వాధీనం

హుస్నాబాద్, జూలై 9: అక్కన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లంపల్లి గ్రామ శివారులో రంగారెడ్డి స్థలంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపును సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, అక్కన్నపేట పోలీసులు సంయుక్తంగా మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. డంపులో 40 టన్నుల వరకు ఇసుక ఉంటుందని వారు తెలిపారు. ఇందుకు సంబంధించి అక్కన్నపేట పీఎస్‌లో కేసు నమోదైంది. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు మాట్లాడుతూ అక్రమంగా ఇసుక, మట్టి, మత్తు పదార్థాలు రవాణా చేయడం గానీ జూదం లాంటివి జరుగుతున్నప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

గుట్కా ప్యాకెట్లు పట్టివేత

సిద్దిపేట టౌన్,జూలై 9 : ప్రభుత్వం నిషేధించిన గుట్కా ప్యాకెట్లు అమ్ముతున్న వ్యక్తిని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్,టూటౌన్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా సీఐ ఉపేందర్ వివరాలు వెల్లడించారు.పట్టణంలో పటేల్‌పూర్‌కు చెందిన సంతోష్ ఇంట్లో గుట్కాప్యాకెట్లు ఉన్నాయనే సమాచారం వచ్చిందన్నారు.ఈ మేరకు సిబ్బందితో వెళ్లి ఇంట్లో తనిఖీ చేయగా రూ.16 వేల విలువగల గుట్కాలు ప్యాకెట్లు లభించాయన్నారు. వాటిని స్వాధీనం చేసుకొని సంతోష్ పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చిదిమేసింది ఎవరు ?

భ్రూణహత్యలకు నిలయంగా జమ్మికుంట, హుజూరాబాద్

- ఇటీవల ఓ యువతికి బలవంతంగా అబార్షన్
- హుస్నాబాద్ పీఎస్‌లో బాధితురాలి ఫిర్యాదు.. కేసు నమోదు
- కుటుంబ సభ్యులు, మధ్యవర్తులు జైలుకు
- వైద్యుడిని ఉపేక్షించడంపై సర్వత్రా విమర్శలు
- మూడు జిల్లాల్లో సంచలనం

హుస్నాబాద్‌కు చెందిన ఓ యువతి తెలిసో తెలియకో ఓ వ్యక్తిని ప్రేమించింది. అతనికి పెళ్లయిందని తెలిసి బాధపడ్డది. అప్పటికే గర్భం దాల్చింది. ఆ తర్వాత అతన్నే పెండ్లి చేసుకుంది. కానీ,ఇదంతా ఆమె కుటుంబ సభ్యులకు నచ్చలేదు. పుట్టింటికి తీసుకెళ్లి, అబార్షన్ చేయించుకోవాలని నచ్చజెప్పారు. జమ్మికుంటలో నిర్ధారణ పరీక్షలు చేసిన అనంతరం ఆ యువతిని హుజూరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించి అబార్షన్ చేశారు. ఈ భ్రూణహత్య కేసు ఇప్పుడు అనేక మలుపులు తిరుగుతున్నది. తనకు బలవంతంగా అబార్షన్ చేయించారని ఇటీవల ఆ యువతి ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు, ఆమె కుటుంబ సభ్యులు ఐదుగురిని, మరో ఇద్దరు మధ్యవర్తులను జైలుకు పంపారు. అబార్షన్ చేసిందెవరో తేల్చే పనిలో ఉన్నారు. అయితే ఎన్ని ఘటనలు జరుగుతున్నా జమ్మికుంట, హుజూరాబాద్ కేంద్రంగా భ్రూణహత్యల పర్వం కొనసాగుతూనే ఉండడం అధికారులనిర్లక్ష్యానికి అద్దంపడుతున్నది.

కరీంనగర్, జూలై 9 (నమస్తే తెలంగాణ)/ హుస్నాబాద్: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందిన ఓ యువతి అదే పట్టణానికి చెందిన ఓ వ్యక్తి కొంతకాలంగా ప్రేమించుకున్నారు. పెండ్లి చేసుకుంటామని నిర్ణయించుకుని సహజీవనం చేశారు. ఫలితంగా ఆమె గర్భందాల్చింది. తర్వాత పెళ్లి చేసుకున్నది. అయితే అతడికి ఇది వరకే పెళ్లయిన విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో ఆ యువతిని పుట్టింటికి తీసుకెళ్లి నచ్చజెప్పారు. ఆమెకు ఎలాగైనా అబార్షన్ చే యించాలని మొదట ప్రయత్నించగా, ఆ యువతి అంగీకరించలే దు. అబార్షన్ తర్వాత మాట్లాడుదామని ఆమె కుటుంబ సభ్యులు నచ్చజెప్పారు. దీంతో భూపాలపల్లి జిల్లా చిట్యాలపల్లి మండలం టేకుమట్లకు చెందిన ఓ ఆర్ఎంపీని యువతి తల్లిదండ్రులు ఆశ్రయించారు. ఆయన జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లాడు. అక్కడ గర్భ నిర్ధారణ పరీక్షలు నిర్వహించిన వైద్యులు, హు జూరాబాద్‌లోని మరో ప్రైవేట్ దవాఖానకు తరలించి అబార్షన్ చేశా రు. ఇప్పటి వరకు ఈ వ్యవహారం గుట్టుగానే సాగింది. అయితే కొద్ది రోజులకు తాను పెండ్లి చేసుకున్న వ్యక్తి వద్దకు తిరిగి వెళ్లిన ఆ యు వతి, జరిగిన విషయం అతనికి చెప్పింది. అంతటితో ఆగకుండా తనకు బలవంతంగా అబార్షన్ చేయించారని తన కుటుంబ సభ్యులతోపాటు ఆర్ఎంపీ డాక్టర్, వైద్యులపై ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు యువతి కుటుంబ సభ్యులు ఐదుగురితో పాటు టేకుమట్లకు చెందిన ఆర్ఎంపీని, జమ్మికుంటకు చెం దిన సదరు ప్రైవేట్ దవాఖాన పీఆర్‌వోను అరెస్ట్ చేసి జైలుకు పంపారు.

అసలు దోషులు ఎవరు..?

సదరు యువతికి అబార్షన్ చేయించినట్టు తమ నేరాంగీకార పత్రంలో నిందితులు ఒప్పుకొన్నట్టు హుస్నాబాద్ పోలీసులు చెబుతున్నారు. అయితే ఆర్ఎంపీ ఇచ్చిన నేరాంగీకర పత్రంలో మరో సంచలన విషయం బయటపడింది. ఈ కేసులో యువతి కు టుంబ సభ్యుల నుంచి ₹62 వేలు తీసుకున్నట్టు, అందులో ₹30 వేలు తాను ఉంచుకుని మిగతా ₹32 వేలు అబార్షన్ చేసిన హుజూరాబాద్‌కు చెందిన ఓ వైద్యుడికి ఇచ్చినట్టు అంగీకరించారు. ఈ విషయాన్ని హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్ కూడా నిర్ధారించారు. హుజూరాబాద్‌కు చెందిన సదరు వైద్యుడిని అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు కూడా సీఐ తెలిపారు. నిజానికి ఈ అబార్షన్ చేసిందెవరనే విషయంలో స్పష్టత లేదు. కొంత కాలంగా జమ్మికుంట, హుజూరాబాద్ కేంద్రంగా భ్రూణహత్యల దారుణాలు పెరిగిపోతున్నాయి. ఇక్కడ పనిచేసే వైద్యులు కాసులకు కక్కుర్తిపడి ఈ ఘాతుకాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇదే కేసులో జమ్మికుంట ప్రైవేట్ దవాఖానలో పనిచేస్తున్న పీఆర్‌వో ఏ డాక్టర్ పేరు చెప్పకుండా తానే అబార్షన్ చేశానని ఒప్పుకున్నట్టు తెలుస్తున్నది. అదే ఆర్ఎంపీ నేరాంగీకార పత్రంలో మాత్రం హుజూరాబాద్‌కు చెందిన ఓ ప్రముఖ వైద్యుడి పేరును వెల్లడించినట్లు తెలిసింది. ఈ రెండు విషయాల్లో పొంతన లేకపోవడంతో అసలు హుజూరాబాద్‌కు చెందిన వైద్యుడే అబార్షన్ చేశారా..? జమ్మికుంటకు చెందిన వైద్యుల ప్రమేయం ఏమైనా ఉన్నదా..? అనే విషయం పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. మొత్తానికి ఈ భ్రూణ హత్య వ్యవహారం కరీంనగర్, భూపాలపల్లి, సిద్దిపేట జిల్లాల్లో ఇపుడు చర్చనీయాంశంగా మారింది.

పౌష్టికాహారం తీసుకోవాలి

మిరుదొడ్డి, జూలై 9 : రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని చిన్నారులు, బాలింతలు స్వీకరించి ఆరోగ్యంగా ఉండాలని మిరుదొడ్డి టౌన్ కార్యదర్శి ఎండీ.ఫహీమ్ అన్నారు. మంగళవారం మిరుదొడ్డి టౌన్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిన్నారుల పెరుగుదల పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం విషయంలో చిన్నారులు, బాలింతలు అలసత్వం వహిస్తే అనారోగ్య సమస్యలు ఏర్పడి ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కమిటీ ఎన్నిక

చేర్యాల, జూలై 9 : చేర్యాల పట్టణ ఆర్యవైశ్య కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మంచాల ఆంజనేయులు, అధ్యక్షుడిగా వంగపల్లి శ్రీనివాస్, ప్రధానకార్యదర్శిగా ఉప్పల నాగరాజు, కోశాధికారిగా తేరాల శ్రీనివాస్, పీఆర్‌వోగా శేరి బాలనారాయణ, ఉపాధ్యక్షులుగా అయిత రవీందర్, పిన్న వీరమల్లయ్య, యాంసాని బాలనారాయణ, యాంసాని లక్ష్మణ్, సహాయ కార్యదర్శులుగా పెద్ది రమేశ్, మంకాల రాజు, పుసనాల వీరేశం, గందె నర్సయ్యతో పాటు కార్యవర్గసభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళా విభాగం అధ్యక్షురాలిగా తోట పద్మ, యువజన మహాసభ అధ్యక్షుడిగా ఓరుగంటి శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు.

పాల కోసం వెళ్తే ప్రాణం పోయింది

కొండపాక(కుకునూరుపల్లి), జూలై 9 : పాల కోసం వెళ్తే ప్రాణం పోయిన సంఘటన త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొండపాక మండలం దుద్దెడకు చెందిన మల్లం శ్రీనివాస్(44) రోజు మాదిరిగానే తన ద్విచక్ర వాహనంపై మంగళవారం ఉదయం దుద్దెడ పాలకేంద్రానికి వెళ్లి పాలు తీసుకొని ఇంటికి వస్తున్నాడు. బందారం దర్గాకమాన్ వద్ద యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో వెనక నుంచి అతి వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టడంతో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య మల్లం రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నంగునూరు, జూలై 9: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని బద్దిపడగలో జరిగింది. పరకాల గ్రామానికి చెందిన విజయ్ కుమార్ (40) సిద్దిపేటలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ ఇంటిగ్రేటెడ్ బాలుర హాస్టల్‌లో పని చేస్తున్నాడు. మంగళవారం హుస్నాబాద్ నుంచి సిద్దిపేటకు బైక్‌పై వస్తున్న క్రమంలో బద్దిపడగ బస్టాండ్ వద్ద ట్యాంకర్‌ను అతడు ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108 ద్వారా సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ విషమించి మృతి చెందాడు.

కక్షపూరితంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్

- బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జూలై 9: అసంపూర్తిగా మిగిలిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేసేలా ప్రభుత్వం చొరవ చూపాలని, ప్రొసీడింగ్ వచ్చిన గ్రామ పంచాయతీ, కుల సంఘాల భవన నిర్మాణాలు ప్రారంభించాలని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్‌లో నిర్మాణం మధ్యలో ఆగిపోయిన బస్టాండ్‌ను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. గజ్వేల్ అభివృద్ధిపై ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని, అభివృద్ధిని అడ్డుకునేలా కనిపిస్తుందని రూ.170కోట్ల అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయన్నారు. అభివృద్ధిని అడ్డుకుంటూ విడుదలైన నిధులను ప్రభుత్వం వెనక్కి తీసుకుపోతున్నదన్నారు. గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌లో నిర్మాణం మధ్యలో ఆగిన పనులను వెంటనే ప్రారంభించేలా చూడాలన్నారు. గ్రామపంచాయతీ, కుల సంఘాల భవనాలు, సీసీ రోడ్ల నిర్మాణాలకు గతంలోనే కేసీఆర్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వాటని రద్దు చేసి నిధులను వెనక్కి తీసుకువెళ్లిందన్నారు. కొండపోచమ్మ, మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణం చేసి మండుటెండల్లో రైతుల సాగుకోసం గోదావరి జలాలను అందించామని, అలాంటి ప్రాజెక్టుల్లోకి నేడు నీటిని విడుదల చేయడం లేదని,కాల్వల నిర్మాణ పనులను పూర్తి చేసి రైతులకు సాగునీళ్లు అందించాలని డిమాండ్ చేశారు. అసంపూర్తిగా ఉన్న కోటమైసమ్మ రోడ్డు, ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో పెండింగ్‌లో ఉన్న ప్యాకేజీలు, ఇతర సదుపాయాలు కల్పించాలన్నారు. ఎంపిక చేసిన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించాలన్నారు. మండల కేంద్రాల్లో నిర్మాణాల్లో ఉన్న ఐవోసీ భవనాలను పూర్తి చేయాలన్నారు. ఏసీపీ కార్యాలయం, ములుగు పీఎస్‌లను నిర్మించాలన్నారు. మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ మల్లేశం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మధు, పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, వైస్ చైర్మన్ జకీయోద్దీన్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, విరాసత్‌అలీ, రమేశ్‌గౌడ్, స్వామి, నరేశ్‌గౌడ్, స్వామి, బాలకిషన్, కౌన్సిలర్లు మెట్టయ్య, శ్రీనివాస్, కనకయ్య, రహీం, దుర్గాప్రసాద్, చందు పాల్గొన్నారు.

33వేల మొక్కలు నాటడమే లక్ష్యం

హుస్నాబాద్‌టౌన్: మొక్కలు నాటుతున్న మున్సిపల్‌చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న

హుస్నాబాద్‌టౌన్, జూలై 9: హుస్నాబాద్ పట్టణంలో 33వేల మొక్కలు నాటడమే లక్ష్యమని మున్సిపల్‌చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని 1వ వార్డులో వనమహోత్సవకార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని విద్యాలయాలు, వైకుంఠధామాలు, ప్రధాన రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటాలని నిర్ణయించినట్లు తెలిపారు. 8,372 ఇండ్లు పట్టణంలో ఉన్నాయని, ప్రతి ఇంటికి రెండులేదా మూడు మొక్కలను ఉచితంగానే అందించే ఏర్పాట్లు సైతం చేసినట్లు చెప్పారు. నేతాజీనగర్‌లోని స్థలంలో ట్రీపార్క్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, భవిష్యత్ తరాలకు కాలుష్యం లేని వాతావరణం అందించాల్సిన అవసరం మనపైనే ఉందని ఆమె చెప్పారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కొంకట నళినిదేవి కోఆప్షన్ సభ్యుడు ఆయూబ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, వనమహోత్సవం సూపర్‌వైజర్ జాలిగాం శంకర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రవికుమార్, వార్డు అధికారి ఎల్లయ్య, సాంబ రాజు, మెప్మా ఆర్పీ సుమలత, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

జగదేవ్‌పూర్, జూలై9: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో యాదగిరి అన్నారు. మంగళవారం మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు ఈజీఎస్ సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వనమహోత్సవంలో భాగంగా మండలం వ్యాప్తంగా 90 వేల మొక్కలు నాటాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మిషన్ భగీరథ సర్వే లోటుపాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీవో శ్రీనివాసవర్మ, మిషన్ భగీరథ ఏఈ తిరుమల్‌రెడ్డి, టీఏ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేంద్ర సహాయ మంత్రికి వినతి

మంత్రి బండి సంజయ్‌కి వినతి పత్రం అందజేస్తున్న మధుయాదవ్

కొమురవెల్లి, జూలై 9 : తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లిలో రైల్వేస్టేషన్ పనులు త్వరగా ప్రారంభించాలని కోరుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి మంగళవారం బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి ఎక్కలదేవి మధుయాదవ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వచ్చే మల్లన్న జాతర వరకు కొమురవెల్లిలో రైల్వేస్టేషన్ పూర్తయ్యే విధంగా కృషిచేయాలని, మల్లన్న ఆలయాన్ని ప్రసాద్ పథకంలో చేర్చి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఆయన కోరారు.

పిల్లలకు పౌష్టికాహారం పెట్టాలి

బెజ్జంకి, జూలై 9: పిల్లలకు పౌష్టికాహారం పెట్టాలని ఐసీడీఎస్ అధికారి నాగరాణి అన్నారు. మంగళవారం మండలంలోని దాచారంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల ఎత్తు, బరువు పెరుగుదల కొలతలను ఆమె చూశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఏఎన్ఎం వినోదకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో విష్ణు, కార్యదర్శి సురేశ్, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, స్వప్న పాల్గొన్నారు.

విద్యార్థినికి ఘన స్వాగతం

విద్యార్థినికి స్వాగతం పలుకుతున్న బక్రిచెప్యాల జడ్పీహెచ్ ఉపాధ్యాయులు

సిద్దిపేట అర్బన్, జూలై 9 : గుజరాత్ రాష్ట్రంలోని వాద్‌నగర్‌లో జూన్ 30వ తేదీ నుంచి ఈ నెల 6వ తేదీ వరకు జరిగిన ప్రేరణ కార్యక్రమంలో పాల్గొని తిరిగి వచ్చిన మండలంలోని బక్రిచెప్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని మీర్జా సపురాకు మంగళవారం ఉపాధ్యాయ బృందం ఘన స్వాగతం పలికింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చదువుకున్న వాద్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో ఏడు రోజులు కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులందరూ మీర్జా సపురాను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సై మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి

కొమురవెల్లి, జూలై 9 :అశ్వరావుపేట ఎస్సై శ్రీరామ్ శ్రీనివాస్ మృతిపై ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని కుల వివక్ష పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బక్కెల్లి బాలకిషన్ డిమాండ్ చేశారు. మంగళవారం కొమురవెల్లి మండల కేంద్రం లో ఆయన మాట్లాడారు. దళిత ఎస్సై ఆత్మహత్యకు కారణమైన సీఐ జితేందర్‌రెడ్డితో పాటు కానిస్టేబుళ్లను వెంటనే సర్వీస్ నుంచి డిస్మిస్ చేయాలన్నారు. పోలీస్‌శాఖలో కులవివక్షతపై సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించాలన్నారు. ఎస్సై ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కర్రోళ్ల ఎల్లయ్య, తాడూరి మల్లేశం, కాసర్ల రాజేశ్వర్ పాల్గొన్నారు.

కేసీఆర్‌పై అసభ్యకర పోస్టులు

వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు

మద్దూరులో ఏఎస్సై జగదీశ్వర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ యూత్ నాయకులు

మద్దూరు(ధూళిమిట్ట), జూలై 9: మాజీ సీఎం కేసీఆర్‌పై సోషల్ మీడియాలో అసభ్యకర రీతిలో పోస్ట్ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం మద్దూరు పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ ధూళిమిట్ట మండల యూత్ అధ్యక్షుడు బడుగు సాయిలు ఆధ్వర్యంలో పలువురు యూత్ నాయకులు ఏఎస్సై జగదీశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బడుగు సాయిలు మాట్లాడుతూ.. ఫేస్‌బుక్‌లో ఆదిత్యచౌదరి రాయుడు అనే వ్యక్తి మద్యం సీసాలతో కూడిన కుర్చీలో కూర్చున్నట్లు కేసీఆర్ ఫొటోను మార్ఫింగ్ చేసి పోస్ట్ చేసినట్లు తెలిపారు. కేసీఆర్‌ను ఎంతగానో అభిమానించే తమ మనోభావాలు దెబ్బతీసే విధంగా సదరు పోస్ట్ ఉందని, దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకొని నిందితున్ని కఠినంగా శిక్షించాలని కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ మద్దూరు మండల యూత్ అధ్యక్షుడు గూడ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు పోతుగంటి రవీందర్, ఉమ్మడి మద్దూరు మండల సోషల్ మీడియా ఇన్‌చార్జి పాకాల కిరణ్‌కుమార్, యూత్ నాయకులు పిడిశెట్టి గౌరీశ, నల్ల అమర్ ఉన్నారు.

వాసవి మాత పారాయణం

సిద్దిపేట టౌన్,జూలై 9 : ఆర్యవైశ్య సిద్దిపేట ఇందిరమ్మకాలనీ ఆధ్వర్యంలోమంగళవారం వాసవి మాత పారాయణం చేశారు. ఈ సందర్భంగా మహిళలు ప్రత్యేకంగా 21 రకాల ప్రసాదాలను తయా రు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మంకాల శ్రీనివాస్, చింత శ్రీనివాస్, కృష్ణమూర్తి, బాలరాజ్, కూర శివకుమార్, మనోజ్‌కుమార్, శ్రీనివాస్, మల్లేశం, రమేశ్,రాజు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులపై దాడులు

మార్కుక్, జూలై 9 : గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నవారిపై జిల్లా ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా మంగళవారం మండలంలోని గణేశుపల్లి గ్రామంలోని బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ అధికారులతో కలిసి దాడులు చేసి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపారు. గ్రామాల్లో అక్రమంగా మద్యం, జూ దం, ప్రభుత్వం నిషేధించిన గుట్కాలతో పాటు ఇసుక,పీడీఎస్ బియ్యంపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఫోన్ అప్పగింత

కొమురవెల్లి, జూలై 9 : పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా స్వాధీనం చేసుకున్న ఫోన్‌ను మంగళవారం కొమురవెల్లి పోలీసులు బాధితుడికి అందజేశారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పోసాన్‌పల్లికి చెందిన ఎండీ.పహీం పోసాన్‌పల్లి నుంచి కొండపోచమ్మకు వెళ్తున్న క్రమంలో తన మొబైల్‌ను పోగొట్టుకున్నాడు. అతడు కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై రాజు పోలీస్‌స్టేషన్‌కు బాధితుడిని పిలిపించి ఫోన్‌ను అప్పగించారు. పోలీస్ సిబ్బంది సిద్దిక్, రత్నాకర్ ఉన్నారు.